❖•❖•❖ 10 ❖•❖•❖

# యేసు చేయని ప్రార్థన[1]

*"ఈ సమయమున నేను నా తండ్రిని వేడుకొనలేననియు, వేడుకొనినయెడల ఆయన పండ్రెండు సేనా వ్యూహములకంటె ఎక్కువ మంది దూతలను ఇప్పుడే నాకు పంపడనియు నీవనుకొనుచున్నావా?" (మత్తయి 26:53).*

యేసు పట్టబడుటకు ముందు ప్రార్థన మరియు మనఃస్ఫూర్తిగా ప్రార్థించుట గూర్చిన చర్చలతో నిండియుండిన ఒక సుధీర్ఘ రాత్రి గడిచిపోయింది. పస్కాను భుజించినప్పుడు మరియు జ్ఞాపకార్థ రాత్రి భోజన సంస్కారమును వ్యవస్థాపించినప్పుడును, యేసు తన అపొస్తలులతో ప్రార్థించాడు (మత్తయి 26:26, 27). ఆయన తన అపొస్తలులతో సంభాషించిన వీడ్కోలు సంభాషణలలో (యోహాను 14–16), వారు ప్రార్థించవలెనని ఆయన వారిని ప్రోత్సాహించాడు. ఆయన వారితో,

> మీరు నా నామమున దేని నడుగుదురో తండ్రి కుమారునియందు మహిమపరచబడుటకై దానిని చేతును (యోహాను 14:13).
>
> నాయందు మీరును మీయందు నా మాటలును నిలిచియుండినయెడల మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును (యోహాను 15:7).

ఆ దినమున మీరు దేని గూర్చియు నన్ను అడుగరు; మీరు తండ్రిని నా పేరట ఏమి అడిగనను ఆయన మీకు అనుగ్రహించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను అని చెప్పాడు (యోహాను 16:23).

సున్నితమైన ఈ హెచ్చరికల తరువాత, యేసు మరియు తన శిష్యులును గెత్సేమనే తోటలోనికి వెళ్లుటకు కొద్ది గడియలకు ముందు, ఆయన వారి సమక్షములో గొప్ప ప్రధాన యాజకుని ప్రార్ధన చేశాడు (యోహాను 17:1–26). ఆ తోటలో, ఆయన ఉద్వేగభరితముగా విజ్ఞప్తిచేయుచు సమీపించుచుండిన తీర్పు మరియు సిలువ మరణము గూర్చి తన తండ్రిని వేడుకొంటూ గొప్ప అపేక్షతో ప్రార్థించాడు (మత్తయి 26:39–46).

మధ్యరాత్రి గడిచిన కొంతసేపటికి, ప్రార్థించుట ముగించుకొనిన యేసు ఆయనను పట్టుకొనవలెనని సాయుధులై వచ్చిన సమూహమును కలుసుకొనుటకు బయటికి వచ్చాడు. ఏది ఏమైనా, ఆయన తనను తాను వారికి అప్పగించుకొనుచు, ఆయన చేయవలెనని ఆశించిని ప్రార్థన ఒకటున్నదని ఆయన స్పష్టము చేశాడు. సైన్య సమూహము ఆయనను పట్టుకొని బంధించినప్పుడు, పేతురు తన కత్తిని దూశాడు. మల్కు అను పేరుగల ఒకని చెవిని తెగనరికాడు. అటువంటి దౌర్జన్యమును ఆపవలసినదిగా యేసు తన శిష్యులకు ఆజ్ఞాపించి, మల్కు చెవిని బాగుచేశాడు. కరుణామయమైన ఈ చర్య ప్రతి ఒక్కరు ప్రశాంతముగా ప్రవర్తించునట్లు చేసినది. అప్పుడు యేసు, “కత్తి వరలో ఉంచుము; తండ్రి నాకు అనుగ్రహించిన గిన్నెలోనిది నేను త్రాగకుందునా?” అని పేతురుతో అన్నాడు (యోహాను 18:11). “నేను నా తండ్రిని వేడుకొనలేననియు, వేడుకొనినయెడల ఆయన పండ్రెండు సేనా వ్యూహములకంటె ఎక్కువ మంది దూతలను ఇప్పుడే నాకు పంపడనియు నీవు అనుకొనుచున్నావా?” అని కూడా పేతురుతో చెప్పినట్లు మత్తయి వ్రాయుచున్నాడు (మత్తయి 26:53). *ఆయన ఎదుర్కొనుచుండిన తీర్పు నుండి ఆయనను విడిపించుటకు పరలోక దూతల సైన్యసమూహమును పంపవలెనని యేసు తన తండ్రిని అడుగగలిగి యుండెను, కానీ ఆయన అలాప్రార్థించుటకు ఆశించలేదు.*

ఆయన ఆజ్ఞాపించినంతలోనే అరుదెంచునట్లు ఆదేశమివ్వగల అపరిమితమైన శక్తి మన రక్షకుడు కలిగియుండెను. ఒక్క పిలుపునిచ్చినంతలోనే ఆయన యొద్దకు పరుగెత్తుకొని వచ్చుటకు దూతల సర్వసైన్యసమూహము ఆయన తండ్రి యొక్క సర్వశక్తిమంతమైన సింహాసనము యెదుట సంసిద్ధముగా నుండెను. అలాగైతే ఆయన వారిని ఎందుకు పిలువలేదు? ఈ ప్రశ్నకు గల సమాధానము మనము యేసు హృదయములో ఏముండినదో తెలుసుకొనవలెనను కుతూహలము కలిగించును.

*విధేయతగల ఆయన హృదయము ఆయనను ఆ ప్రార్థన చేయనీయలేదు.* తన తండ్రి చిత్తమునే నెరవేర్చవలెనని తన హృదయములో దృఢముగా నిశ్చయించుకొనుచు, ఆయన తోటలో ఆ నాటి రాత్రి వేదనతో ప్రార్థన చేయుటలో చెప్పుకోదగినంత సమయము గడిపాడు. కనీసము మూడుసార్లు, “నా యిష్ట ప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్ము” అని ఆయన తన తండ్రితో చెప్పాడు (మత్తయి 26:39సి). యేసు హృదయము మరియు నోట నుండి తన సమర్పణాభిప్రాయమును తీసివేయుటకు అపవాది సకల కాలములలో లేని గొప్పపోరాటములో యేసును నిమగ్నము చేశాడు. యేసు చేయుచుండిన ప్రార్థనను అణచివేయుటకు సాతాను

వానికున్న శాయశక్తులను ఉపయోగించాడు. ఆయనకు విరుద్ధముగా వాడు రూపొందించుకొన గలిగిన ప్రతి వాదనను, ప్రతి బహుమానమును, ప్రతి భయమును, మరియు ప్రతి బెదిరింపును ముందుంచాడు; కానీ వాని శక్తిమంతమైన ఆనకట్టు దేనినీ ఆపలేకపోయినది యేసు ఈ ఉద్దేశమును మనస్సులో ఉంచుకొని ఇహలోకమునకు వచ్చాడు, అయితే దుష్టుడు ఆయన తన ఉద్దేశమును నెరవేర్చుకొనకుండా ఆయనను నిరోధించలేకపోయాడు. "ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్ను తాను తగ్గించుకొనెను" అని పౌలు చెప్పాడు (ఫిలిప్పీయులకు 2:8).

*ఆయన ఆ ప్రార్థన చేయుటకు నీతిమంతమైన ఆయన హృదయము ఆయనను అనుమతించలేదు.* ఆయన పాపము నిమిత్తమైన తన గొప్ప బలియాగము ద్వారా దేవుని నీతిని ప్రకటించుటకు వచ్చాడు. "దేవుడు ... క్రీస్తుయేసు రక్తమునందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను" అని పౌలు చెప్పుచున్నాడు (రోమీయులకు 3:26ఎ). ఆయన పాప దోషమును సిలువ ద్వారా సంధించెను. దేవుని పరిపూర్ణమైన కుమారుడుగా, "మనమాయనయందు దేవుని నీతి అగునట్లు" ఆయన మన కొరకు పాపముగా తనను తాను అర్పించుకొన్నాడు (2 కొరింథీయులకు 5:21). ఈ సందర్భములో, "అపవాది యొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను" అని అపొస్తలుడైన యోహాను చెప్పిన మాటలను ఉపయోగించుకొనవచ్చును (1 యోహాను 3:8బి). ఏదేను తోటలో తొలి పాపము చేయబడినది మొదలుకొని సిలువ వరకును, ఒక విధముగా, పాపము ఏలినది. యేసు రక్తము చిందింపబడుటతో, దేవుని నీతి వలన కృప విస్తరించుచున్నది. విధేయతతో కూడిన విశ్వాసము ద్వారా క్రీస్తు నొద్దకు వచ్చు ప్రతివాని పాపములు క్షమింపబడును. యేసు, నీతిమంతుడైనవాడు, ఆయనను ఈ సంఘర్షణలో నుండి కాపాడి సంరక్షించుటకు దేవుడు తన దూతలను పంపవలెనని ప్రార్థించలేక పోయాడు; ఆయన అటువంటి ప్రార్థన చేయకుండునట్లు ఆయన నీతి ఆయనను నిరోధించినది.

*ప్రేమగల ఆయన హృదయము ఆయనను ఆ ప్రార్థన చేయనీయలేదు.* ఆయన తన మరణము ద్వారా మనకు తండ్రి ప్రేమను కనుపర్చుటకు వచ్చాడు. ఆ ప్రేమయే ఆయన తనను తను కంటె మనకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చునట్లు చేసినది. ఆయన కేవలము తన స్వంత వ్యక్తిగత ఆసక్తులను లేక కోరికలను నెరవేర్చుకొనవలెనని ఆశించలేదు, కానీ ఈ లోకములోని మానవులందరి అవసరములను తీర్చుటకు తనను తాను పెట్టుబడిగా పెట్టాడు. యేసు, "దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలి-కగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్నుతానే రిక్తునిగా చేసికొనెను" అని పౌలు చెప్పాడు (ఫిలిప్పీయులకు 2:6, 7ఎ). "అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను" అని కూడా పౌలు చెప్పాడు (రోమీయులకు 5:8). యేసు సైనికులును ప్రధాన యాజకులును గల సమూహమును సమీపించుట మనము గమనించునప్పుడు, "తన స్నేహితులకొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేదు" అని మాత్రమే చెప్పుకొనగలము (యోహాను 15:13).

యేసు సహింపశక్యముకాని వేదనతో సిలువపై వ్రేలాడుచుండినప్పుడు ఆయన వినిన హృదయమును గాయపర్చు ఒక విమర్శలోని మాటలు: "నీవు దేవుని కుమారుడవైతే సిలువ మీదనుండి దిగుము" (మత్తయి 27:40బి). శాస్త్రులును పెద్దలును సహితము ఆయనను ఎగతాళి చేయుచు, "వీడు ఇతరులను రక్షించెను, తన్నుతానే రక్షించుకొనలేడు; ఇశ్రాయేలు రాజుగదా, యిప్పుడు సిలువమీద నుండి దిగినయెడల వాని నమ్ముదుము. వాడు దేవుని యందు విశ్వాసముంచెను, నేను దేవుని కూమారుడనని చెప్పెను గనుక ఆయనకిష్టుడైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించును" అని పలుకుచు ఆయనపై నేరారోపణ చేశారు (మత్తయి 27:42, 43). అది ఎంతో గొప్ప మర్మమైనందువలననేకదా ఈ మతసంబంధమైన నాయకులు దానిని గ్రహించలేక పోయారు! యేసు ఈ సిలువ మరణ శ్రమను దైవసంకల్పము ప్రకారములోక రక్షణార్థమైన పాపపరిహారార్థ బలిగా నియమించబడినదని దానిని అనుభవించుటకే బద్ధుడైయుండెను. ఆయనను విడిపించుమని తండ్రిని ఏ క్షణములోనైనా ఆయన అడిగియుండగలడు, అప్పుడు తండ్రి అందుకు అవసరమైన సముచిత ఏర్పాటు గావించెడివాడు. దేవుడు చేయవలసినదెల్లా కలువరి గిరి వైపు అలా ఒక్కసారి చూచుటయే, అప్పుడు సిలువ మరణము సంపూర్తిగా స్తంభించిపోయేదే. ఏదిఏమైనా, యేసు విడుదల కొరకు ప్రార్థించలేదు. ఆయన మన రక్షకుడై యుండుటకు శ్రమయను అగ్ని గుండము గుండా వెళ్లవలసియుండినప్పటికిని ఆయన మనకు రక్షకుడుగా నుండుటకే దృఢసంకల్పముగలవాడై యుండెను.

❖•❖•❖

*దేవుని చిత్తము నెరవేరవలెనని యేసు ప్రార్థించాడు, మరియు దాని అర్థమేమైయుండునో ఆయన ఎరిగియుండెను. ఆయన లేచి తన మరణము కొరకు వెదకు చుండిన వారిని కలిసికొనుటకు వెళ్లినప్పుడు, అది సంపూర్తిగా నెరవేరవలెనని ఆయన నిర్ణయించుకొన్నాడు. ఆయనను విడిపించుటకు దూతల సైన్య సమూహము దిగి రావలెనని ఆయన అడుగలేదు, కానీ ఆయన సిలువ మీద ఉండి ఆయన యొద్దకు వచ్చు వారందరికిని రక్షణను సమకూర్చునట్లు తన తండ్రి ఆయనను బలపరచలెనని ప్రార్థించెను.*

---

సూచన

[1]ఈ పాఠము శీర్షిక, *Facing the Cross* (Columbus, Ohio: Wartburg Press, 1955), 13 రచయిత Stanley D. Schneider సలహా మేరకు పెట్టబడినది.